తొలితరం కమ్యూనిస్టు, సిపిఐ(ఎం-ఎల్) నాయకులు

కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములుగారికి విప్లవ జోహార్లు!

తొలితరం కమ్యూనిస్టు, సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములుగారు (97సం॥లు) నిండైన పరిపూర్ణ జీవితం గడిపి జనవరి 21న అమరులైనారు. ఐదుతరాల ప్రతినిధిగా జీవించడమేగాక, సుమారు ఎనభై సం॥లు కమ్యూనిస్టుగా జీవించే అవకాశం ప్రకృతి ఆయనకిచ్చిన వరం. సమాజంలో జరుగుతున్న, దేశవ్యాప్తంగా వస్తున్న మార్పులను, చరిత్ర గమనాన్ని అర్థం చేసుకుంటూ తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంత, ఆచరణాత్మక కృషిలో చివరికంటా నిలిచిన కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు ప్రజలకు, కమ్యూనిస్టు ఆదర్శాలకు, విలువలకు ప్రతీక.

కామ్రేడ్ శ్రీరాములు గుంటూరుజిల్లా, రేపల్లె తాలూకా, చోడాయపాలెం ఫిర్కా చెన్నుపల్లివారిపాలెంలో జన్మించారు. ఎనిమిదవ తరగతి, టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. టీచర్ ట్రైనింగ్ సమయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారి నాయకత్వంలో కృష్ణాకాలువ తవ్వకం పనిని గమనించి, ప్రభావితులైనారు. టీచర్ ట్రైనింగ్‌కు ముందు ప్రజలకు చదువు అందించాలనే లక్ష్యంతో మృత్యుంజయపాలెంలో ప్రయివేట్ స్కూలు నడిపారు. ట్రయినింగ్ పూర్తిఅయినాక స్వగ్రామమైన చెన్నుపల్లివారిపాలెంలోనే 1943లో స్వంతంగా మేనేజ్‌మెంటు స్కూలు ప్రారంభించారు. ప్రభుత్వమే స్కూళ్ళను నడపాలనే డిమాండ్‌తో 1950లో స్కూలును ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. 1946లో పార్టీ సభ్యత్వం పొంది, గ్రామంలో పార్టీ యూనిట్ ఏర్పరిచారు. ఆ సం॥ మేలో జరిగిన ఎలక్షన్స్‌లో చురుకుగా పాల్గొన్నారు. 1949లో జిల్లా బోర్డు మెంబరుగా పోటీ చేశారు. 1953 నాటికి పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం కలిసి వుండేవి. అప్పటి పంచాయితీ ఎన్నికల్లో 3 సార్లు ఏకగ్రీవంగా; ఒకసారి పోటీలో నెగ్గారు. చెన్నుపల్లివారిపాలెం పంచాయితీగా ఏర్పడిన తర్వాత రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మరొకసారి తప్పనిసరి పరిస్థితుల్లో వారి భార్య రాజేశ్వరమ్మగారిని పోటీలో నిలిపి గెలిచారు. 1962లో రేపల్లె సమితి వైస్-ఛైర్మన్‌గా పోటీచేసి, గెలిచారు. ఆ కాలంలోనే ఇన్‌ఛార్జీ ఛైర్మన్‌గా చాలా కాలం కొనసాగారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో కూచినపూడి నియోజకవర్గం నుండి పార్టీ తరపున పోటీ చేశారు.

1950లో రేపల్లెకు మకాం మార్చిన కామ్రేడ్ శ్రీరాములు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణగారితో కలిసి తాలూకాలో గ్రామ గ్రామాన సైకిల్‌పై తిరిగేవారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేశారు. ఆనాటి అన్నివర్గాల ప్రజలతో కామ్రేడ్ శ్రీరాములుగారికి ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు వుండేవి. 1950 నుండి 64వరకు పాలకవర్గాల కుట్రల ఫలితంగా ప్రజల మధ్యనున్న వైరుధ్యాలను పెంచే క్రమంలో, వివిధ సామాజిక వర్గాల మధ్య వివక్షతలను పెంచటానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి, సమస్యలను పరిష్కరించటంలో కామ్రేడ్ శ్రీరాములుగారి నైపుణ్యం, నేర్పరితనం, చొరవ ఎన్నదగినవి. తీరప్రాంత గ్రామాల మధ్య సమస్యలు; బొబ్బర్లంక సొసైటీ భూముల సమస్యలు; రాజుపాలెం-లంకెవానిదిబ్బ కాలువ సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టుపార్టీ కృషి, చొరవ అందులో శ్రీరాములుగారి పాత్ర ముఖ్యమైనది.

1956లో లంకెవాని దిబ్బ వద్ద పంటకాల్వకు పడిన గండిని పూడ్చడానికి పార్టీ చొరవతో శ్రీరాములుగారు ఆర్థిక సహకారం తెచ్చి దానిని పూరించారు. తుమ్మల-అడవుల దీవి సమస్యల పరిష్కార కృషిలో ఉండగానే 64లో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద కామ్రేడ్ శ్రీరాములు, కొరటాల, ఘంటా సీతారామయ్య, మండే పిచ్చయ్యలను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఒకటిన్నర సంవత్సరం జైలులో ఉన్నారు. తర్వాత 1975లో కేంద్ర ప్రభుత్వం ఎమర్జన్సీ విధించింది. దేశ వ్యాపితంగా చీకటి రోజులు. ఎమర్జెన్సీ చట్టం క్రింద అరెస్టు చేయబడి శ్రీరాములుగారు రెండు సంవత్సరాలు జైలులో ఉన్నారు. శ్రీరాములుగారు రాజమండ్రి, హైద్రాబాద్ జైళ్ళల్లో చేసిన అధ్యయనం ఆయన జీవితానికి మెరుగులు దిద్దింది.

1964 పార్టీ చీలికలో సిపిఐ(ఎం) వైపు, 1968 పార్టీ చీలికలో తరిమెల నాగిరెడ్డి నాయకత్వాన విప్లవకారులవైపు నిలబడ్డారు. సిపిఎంలో వున్నపుడు గుంటూరుజిల్లా కమిటి సభ్యుడిగా, రేపల్లె తాలూకా పార్టీ కార్యదర్శిగా వున్నారు. అవే బాధ్యతలు విప్లవకారుల వైపు నిలబడిన తర్వాత కూడా కొనసాగించారు. తర్వాత కాలంలో 1979 తుఫాను తర్వాత కొత్తపాలెం, నక్షత్రనగర్ కోసం కామ్రేడ్ కొల్లాటి సత్యనారాయణతో కలిసి కృషిచేశారు. మోళ్ళగుంట ఫారెస్టు భూముల కోసం; బంజరు భూముల కోసం సాగిన పోరాటంలో శ్రీరాములుగారి సహకారం ఎనలేనిది.

1991లో సాగిన సారా వ్యతిరేక పోరాటంలో నిజాంపట్నం, రేపల్లెలలో శ్రీరాములుగారు మహిళా సంఘాలను, యువకులను కదలించారు. 1993లో గుత్తావారిపాలెంలో గూండాల బాంబు దాడిలో శ్రీరాములుగారు తీవ్రంగా గాయపడ్డప్పుడు రేపల్లె ప్రాంత ప్రజానీకం సంఘీభావంగా స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్న తీరు, ఆయన పట్ల ప్రజలకున్న అభిమానానికి నిదర్శనం.

పులిగడ్డ–పెనుమూడి వారధికోసం; మచిలీపట్నం–పెనుమూడి వారధి మీదుగా వెళ్ళే జాతీయ రహదారి రేపల్లె – నిజాంపట్నం మీదుగా వెళ్ళాలని అన్ని పార్టీల తరఫున శ్రీరాములుగారు నాయకుడిగా ఉండి చేసిన కృషి మరువలేనిది. నిజాంపట్నం మాజీ–మిలటరీవాళ్ళ భూములు రాజకీయ బాధితులకు కేటాయించాలని ప్రభుత్వం చేసిన నిర్ణయానికి వ్యతిరేకంగా కామ్రేడ్ కొల్లా వెంకయ్య చేసిన కృషిలో కామ్రేడ్ శ్రీరాములుగారు చివరికంటా పాల్గొన్నారు.

ఇవేకాక 1978లో చోడాయపాలెం ఫిర్కాలో కూలిరేట్ల సమస్యలపై, 1988లో ఎరువుల సమస్యలపై రేపల్లెలో సాగించిన ఆందోళన, 1985 నుంచి భట్టిప్రోలు, పేటేరులలో జరిగిన చేనేత కార్మికుల సమస్యలపై ఆందోళన, 1994లో పేటేరు ఇళ్ళస్థలాల సమస్య – ఆంజనేయస్వామి కాలనీ సాధించడం లాంటివి మచ్చుకు కొన్ని మాత్రమే.

కామ్రేడ్ శ్రీరాములుగారు 1996 నుంచి 2015 వరకు గడిపిన జీవితం నిజమైన అర్థంలో కమ్యూనిస్టుగా జీవించడం. పీడిత ప్రజా ఉద్యమాలు, భూ పోరాటాలు, ఇళ్ళ స్థలాల సమస్యలు లాంటివి; శత్రుదాడులు, పోలీసుల దౌర్జన్యాలు, రాజ్యహింస, సోదర విప్లవసంస్థ దాడులు, ముప్పేట చుట్టుముట్టిన దశ ఇది. రాబిన్‌హుడ్‌గా పిలవబడ్డ గొప్ప నవలా రచయిత, పల్నాడు ప్రాంత పేదల, పీడిత ప్రజల ముద్దుబిడ్డ కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి; పేద ప్రజల ఆకాంక్షలకు ఎర్రజెండా నాయకుడై నిలిచిన కామ్రేడ్ అంగడి చెన్నయ్యల రక్త తర్పణంతో ఏర్పడ్డ పేదల కాలనీలను, వేలాది ఎకరాల ప్రజల భూములను – వాటిపై హక్కును నిలబెట్టడంలో దాదాపు రెండు దశాబ్దాలు పీడిత ప్రజల విప్లవ పార్టీ నాయకత్వంలో పల్నాడులోనూ, గుంటూరు పట్టణంలోనూ కామ్రేడ్ శ్రీరాములుగారు నిర్వహించిన పాత్ర అజరామరం. కమ్యూనిస్టులందరికి ఆదర్శం. కమ్యూనిస్టు నిర్మాణ సూత్రాలను ఆచరిస్తూ – పిడుగురాళ్ళ, లెనిన్‌నగర్, కొండమోడు, వి.యం.ఆర్. కాలనీ; టి.ఎన్.నగర్‌లలో పేదల ఇళ్ళస్థలాల ఏర్పాటు ఆందోళనోద్యమాలలో వారి కృషి అద్వితీయం. కారంపూడి, రెంటచింతల లాంటిచోట్ల వేలాది ఎకరాల భూమి ప్రజల అనుభవంలోకి వివిధ ఆందోళనల ద్వారా వచ్చింది. గుంటూరులోని కాలనీలను, కా॥ అంగడి చెన్నయ్య నిలబడి కట్టించిన ఆఫీసులను; కా॥ చెన్నయ్య స్థూపాన్ని కాపాడుకోవడంలో శ్రీరాములుగారే ప్రజలకు ఆదర్శం. మొహమాటస్తుడుగా, సాత్వికుడిగా కనిపించే శ్రీరాములుగారు రాజకీయాలు, నిర్మాణ విషయాలకొస్తే అన్నీ పక్కకుపోయి ప్రత్యర్థులు దదుచుకునేవిధంగా ఆయన నిలబడిన తీరు – ఆయనకే చెల్లుతుంది. అదే శ్రీరాములుగారి ఆశయ నిర్మాణ నిబద్ధత. అవకాశవాదంతో రాజీపడని కమ్యూనిస్టు నిబద్ధత.

సిపిఐ(ఎం–ఎల్) నాయకులు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములుకు సిపిఐ(ఎం–ఎల్) రాష్ట్ర కమిటి జోహార్లర్పిస్తోంది. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది.

ooooo